సాక్షి కామారెడ్డి

బుధవారం : 28 : ఫిబ్రవరి : 2024



కాంగ్రెస్‌తోనే సంక్షేమం

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం సాధ్యమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 9లో ▸



ఒత్తిడికి గురికావొద్దు

పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని మానసిక వైద్య నిపుణుడు రమణ సూచించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /18.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

ఎల్‌ఆర్‌ఎస్‌కు మోక్షం



కామారెడ్డి బల్దియాకు వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు

- అనధికార లేఅవుట్ ప్లాట్లు, వెంచర్ల క్రమబద్ధీకరణకు చర్యలు
- మూడు బల్దియాల పరిధిలో పెండింగ్‌లో 20,394 దరఖాస్తులు
- మార్చి 31లోగా పరిష్కరించాలన్న సర్కారు

అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. దరఖాస్తులను పరిశీలించి, మార్చి నెలాఖరులోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 20,394 దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని ఆశిస్తున్నారు.

కామారెడ్డి టౌన్: అనధికార లేఅవుట్ ప్లాట్లు, వెంచర్ల క్రమబద్ధీకరణ కోసం అప్పటి ప్రభుత్వం 2020లో ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో భారీగా దరఖాస్తులు దాఖలయ్యాయి. ఓపెన్ ప్లాట్లు, నాన్ లే అవుట్‌కు సంబంధించిన వాటికి రూ. వెయ్యి చెల్లించి తమ డాక్యుమెంట్ కాపీలను జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో అందించారు. వెంచర్‌లకు రూ. 10వేలు చెల్లించి దరఖాస్తులు సమర్పించారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 20,394 దరఖాస్తులు వచ్చాయి. కామారెడ్డి బల్దియాలో 17,394 దరఖాస్తులు రాగా.. బాన్సువాడలో 1,900, ఎల్లారెడ్డిలో 1,100 దరఖాస్తులు నమోదయ్యాయి. దరఖాస్తు రుసుము ద్వారా బల్దియాలకు రూ. 2 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. అయితే ఎల్‌ఆర్‌ఎస్‌పై సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో దరఖాస్తుదారులు నిరుత్సాహానికి గురయ్యారు. ఈ అంశంపై ప్రస్తుత ప్రభుత్వం స్పందించింది. మార్చి నెలాఖరులోగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించింది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు భారీగా ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు.

చక్కటి అవకాశం..

అక్రమ లేఅవుట్‌లలో భవన నిర్మాణాల కోసం ప్రస్తుత మార్కెట్ అంచనాల ప్రకారం 14 శాతం అదనపు పన్నుతో భారీగా డబ్బులు చెల్లించాలి వస్తోంది. ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ అవకాశం లభించడంతో తక్కువ చార్జీతో అనుమతులు పొందడానికి అవకాశం లభించింది. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు ఫైళ్ల దుమ్ముదులిపే పనిలో ఉన్నా రు. దేవదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములను తప్ప ఇతర లేఅవుట్‌లను క్రమబద్ధీకరించనున్నారు. ఈ అవకాశాన్ని భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నిబంధనలకు అనుగుణంగా..



ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో మూడేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నవారికి సమాచారం ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకుని అక్రమ వెంచర్‌లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి. నిబంధనలకు అనుకూలంగా ఉన్నవాటినే క్రమబద్ధీకరిస్తాం.

– గిరిధర్, టీపీవో, కామారెడ్డి

‘టీచర్లు ఎపిక్ నంబర్లు అందించాలి’



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డాటాబేస్ రూపొందించేందుకు ఉపాధ్యాయులు ఎపిక్ నంబర్లను అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం డీఈవో, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఓటరు ఐడీ ఎపిక్ నంబర్ ఇవ్వడంవల్ల ఎన్ని పోస్టల్ బ్యాలెట్ పేపర్లు ముద్రించాలో లెక్కించడంతో పాటు పోస్టల్ బ్యాలెట్ పేపర్‌లను పంపించడానికి వీలుంటుందన్నారు. పాఠశాలలో ముందస్తు అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇక నుంచి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయడానికి మండలాలవారీగా సీనియర్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. సెలవులు అవసరమైతే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. మార్చి 18 నుంచి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలి

కామారెడ్డి క్రైం: ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి ఇందిరా గాంధీ స్టేడియం వరకు 2కే రన్ నిర్వహించారు. కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రన్ లో వివిధ బ్యాంకుల ఉద్యోగులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు సేవలు, డిజిటల్ లావాదేవీలతోపాటు ఆర్థిక నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ భార్గవ్ సుధీర్, జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ రవి కుమార్, ప్రోగ్రాం అధికారులు చంద్రశేఖర్ గౌడ్, వెంకటేశ్వర్లు, ఆర్థిక అక్షరాస్యత కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యత బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

న్యూస్‌రీల్

6న ఆశ్రమ పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పరీక్ష

కామారెడ్డి క్రైం: సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లిలోగల ఆశ్రమోన్నత పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం మార్చి ఆరో తేదీన జిల్లా స్థాయి ఎంపిక పరీక్ష నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి ఆరో తేదీన జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఫిజికల్ టెస్ట్‌లతోపాటు వయసు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పరీక్షలో ఎంపికైనవారికి మార్చి 21 న హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపిక పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల 9 నుంచి 11 ఏళ్లలోపు విద్యార్థులు ఎంపిక పరీక్షలకు హాజరు కావాలని, ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాప్‌ల ద్వారా మార్చి నెలకు సంబంధించిన బియ్యం పంపిణీ ఒకటో తేదీనుంచి ప్రారంభం కానుంది. ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందిస్తారు. మార్చి ఒకటో తేదీనుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

‘పన్ను చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తాం’



కామారెడ్డి టౌన్: గృహ, వ్యాపార భవనాల యజమానులు ఆస్తి పన్నును మార్చి 31వ తేదీలోగా చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ ఆర్‌ఐ జానయ్య కోరారు. మంగళవారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులు వసూలు చేశారు. బకాయిలున్న ఓ హోటల్ యజమాని నుంచి రూ. 2.65 లక్షల పన్నును వసూలు చేశారు. మొండి బకాయిదారులు స్పందించకపోతే మార్చి 31 తర్వాత వారి ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: మద్నూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.రాధిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఇంగ్లిష్, కామర్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్‌లలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత, అనుభవం కలిగిన అభ్యర్థులు రెండో తేదీలోగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకొన్నవారికి ఐదో తేదీన ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నాగిరెడ్డిపేట ఎంపీపీ ఎన్నికపై హైకోర్టు స్టే

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట ఎంపీపీ ఎన్నికపై హైకోర్టు స్టే విధించినట్లు తెలిసింది. ఎంపీపీ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఈనెల 22న నోటిఫికేషన్ విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం బుధవారం ఉదయం ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ఇందుకోసం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరాస్వామి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా ప్రస్తుత వైస్ఎంపీపీ, ఇన్‌చార్జి ఎంపీపీ దివిటి రాజ్‌దాస్ ఎన్నికపై హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించింది. హైకోర్టు స్టే విధించడంతో బుధవారం జరగాల్సిన ఎన్నిక వాయిదాపడనుంది.

పది కిలోల భారీ చేప



నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామ శివారులో గల పంటపొలాల్లో మంగళవారం పదికిలోల మలుగు పాపెర చేప లభించింది. గ్రామ శివారులోని సింగితం రిజర్వాయర్ పంట కాలువ ద్వారా పొలాల్లోకి ఈ చేప వచ్చింది. పొలంలో పెద్ద శబ్దాన్ని గమనించిన గ్రామానికి చెందిన చాకలి అంజయ్య, గొల్ల గణేశ్.. మడిలోకి వెళ్లి వెతకగా చేప కనిపించింది. పొలంలోని నీటిలో దూకుతున్న చేపను వారు పట్టి తూకం వేశారు. పదికిలోల బరువు ఉందని వారు తెలిపారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్‌గౌడ్ (ఫైల్)

భిక్కనూరు: పెళ్లికావడం లేదని మనస్తాపం చెంది ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. భిక్కనూరు రెండో ఎస్సై రాంచందర్‌నాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన కోడూరి శ్రీకాంత్‌గౌడ్(32) చిన్నతనంలోనే తండ్రి సిద్దరాములుగౌడ్ చనిపోయాడు. యుక్తవయసు వచ్చాక కుటుంబ పోషణ కోసం గల్ఫ్ వలస వెళ్లాడు. అక్కడ పనిచేస్తూ ఇద్దరు చెల్లెళ్ల వివాహం జరిపించాడు. సొంతింటి కల నెరవేర్చుకున్నాడు. కొన్నాళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. పెళ్లి కుదరకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం తల్లి నర్సవ్వను బయటకు పంపించి ఇంట్లోకి వెళ్లి తలుపులకు గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. బయటకు వెళ్లిన నర్సవ్వ చుట్టుపక్కల వారిని పిలుచుకుని వచ్చి ఇంటి గడియను తెరిపించి లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ శ్రీకాంత్‌గౌడ్ మృతదేహం కనిపించింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

గృహజ్యోతికి సర్వం సిద్ధం

- వచ్చేనెల ఒకటో తేదీనుంచి అమలు
- జిల్లాలో 2.36 లక్షల గృహవిద్యుత్ వినియోగ కనెక్షన్లు
- 1.89 లక్షల కనెక్షన్లకు పథకం వర్తించే అవకాశం

నాగిరెడ్డిపేట: రాష్ట్రప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలుకు చర్యలు చేపట్టింది. మార్చి ఒకటో తేదీ నుంచి ఈ పథకం అమలులోకి రానుంది. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చాక ఈ పథకం అమలుకోసం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. అనంతరం ఈనెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ట్రాన్స్‌కో అధికారులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి, కరెంట్ మీటర్ సర్వీసుల వారీగా వివరాలు సేకరించారు. సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలో 2.36 లక్షల గృహవిద్యుత్ వినియోగ కనెక్షన్లుండగా.. ఇందులో 1.89 లక్షల కనెక్షన్లకు గృహజ్యోతి పథకానికి అర్హత ఉన్నట్లు గుర్తించారు.

రేషన్‌కార్డుకు ఒక్క మీటరే...

ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్‌ను పొందేందుకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. ఉచిత విద్యుత్ పొందాలంటే తెల్ల రేషన్‌కార్డు తప్పనిసరి. దీంతోపాటు ఒక రేషన్‌కార్డుకు ఒక్క మీటర్ ద్వారా మాత్రమే ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయనున్నారు. కాగా గత ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్‌ను నెలవారీగా సరాసరి చేసి అర్హులను తేల్చినట్లు సమాచారం.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 37 పరీక్ష కేంద్రాలు..
- హాజరుకానున్న 19,509 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

కామారెడ్డి టౌన్: ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమై వచ్చే నెల 16వ తేదీన ముగియనున్నాయి. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 19,509 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం 9,993 మంది, ద్వితీయ సంవత్సరం 9,516 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరి కోసం జిల్లాలోని మూడు డివిజన్‌ల పరిధిలో 37 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 16 ప్రభుత్వ కళాశాలలు, 12 ప్రభుత్వ సంస్థల, 9 ప్రైవేట్ కళాశాలల భవనాలలో పరీక్ష కేంద్రాలున్నాయి. పరీక్షల నిర్వహణ కోసం 37 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 37 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 9 మంది అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు, 9 మంది అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఇద్దరు జిల్లా కోఆర్డినేటర్‌లను నియమించారు. ప్రతి 25 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి. కలెక్టర్, ఎస్పీ, ఇంటర్ నోడల్ అధికారితో ఏర్పాటైన హైపవర్ కమిటీ మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షలను పర్యవేక్షించనుంది.

యథావిధిగా నిమిషం నిబంధన

రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 45 నిమిషాల ముందే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో రెసిడెన్షియల్ కళాశాలల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎగ్జామ్ సెంటర్ల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు, మంచి నీటి సౌకర్యం వంటివి కల్పించారు.

గంట ముందే చేరుకోవాలి..



జిల్లాలో ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోం. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

– షేక్ సలాం, ఇంటర్ నోడల్ అధికారి, కామారెడ్డి

సేవాలాల్ జయంతిలో రాజకీయ రగడ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం
- వేదిక దిగి వెళ్లిపోయిన ఎమ్మెల్యే పోచారం



వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు



వేదిక దిగి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు వాదులాడుకున్నారు. దీంతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వేదిక దిగి వెళ్లిపోయారు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడలోని మీనా గార్డెన్‌లో మంగళవారం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిలను ఆహ్వానించారు. ముందుగా బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించగా.. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదికపైకి స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని, తర్వాత ఎంపీపీ, జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్‌లను ఆహ్వానించారు. చివరగా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిని స్టేజ్‌పైకి ఆహ్వానించడంతో వేడుకలకు వచ్చినవారిలో కొందరు గిరిజనులు ఏనుగు రవీందర్‌రెడ్డికి జై అంటూ నినాదాలు చేశారు. దీంతో వేదికపైనుంచి మాట్లాడుతున్న ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బద్యానాయక్ మైకును కింద పడేసి ఎమ్మెల్యే పోచారం వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి వెళ్లిపోదామంటూ ఎమ్మెల్యేకు చెప్పడంతో ఒక్కసారిగా స్టేజీపై గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. దీంతో ఎమ్మెల్యే వేదిక దిగి వెళ్లిపోయారు. దీంతో గిరిజన నాయకులు కొందరు స్టేజీపైకి వచ్చి గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్‌ను అవమానించి వెళ్లిపోయారంటూ బీఆర్ఎస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా జరుపుకోవాల్సిన పండుగను రాజకీయ రంగుతో అపహాస్యం చేశారంటూ మండిపడ్డారు.

పోడు పట్టాలు వచ్చేలా చూస్తా

పోడు సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలు వచ్చే విధంగా కృషి చేస్తానని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ మహరాజ్ ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ కార్యకర్తలకే పోడు పట్టాలు ఇచ్చారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులైన గిరిజనులకు పట్టాలు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దేశాన్ని నంబర్ వన్‌గా చేయడమే మోదీ లక్ష్యం

- విజయ సంకల్ప యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



మాట్లాడుతున్న డీకే అరుణ

కమ్మర్‌పల్లి: దేశానికి స్వాతంత్య్ర సిద్ధించి 2047 నాటికి వందేళ్లు అవుతుందని, అప్పటిలోగా ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలపాలన్నది ప్రధానమంత్రి మోదీ లక్ష్యమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ చేపట్టిన కొమురం భీం క్లస్టర్ విజయ సంకల్పయాత్ర మంగళవారం నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్, భీమ్‌గల్, ధర్పల్లి, జక్రాన్‌పల్లి, ఆర్మూర్ మండలాల మీదుగా సాగింది. కమ్మర్‌పల్లిలో నిర్వహించిన రోడ్‌షోలో డీకే అరుణ పాల్గొన్నారు. దేశాన్ని మోదీ ప్రణాళికబద్ధంగా ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. కరోనా మహమ్మారి వ్యాప్తి చెందినప్పుడు మన ప్రజలను కాపాడుతూనే ప్రపంచంలోని పలు దేశాలకు వ్యాక్సిన్ అందించిన ఘనత మోదీదన్నారు. అందుకే ప్రపంచ దేశాలన్నీ మోదీ నాయకత్వం వైపు చూస్తున్నాయన్నారు. పేదలకు ఉచితంగా బియ్యం అందిస్తున్నారన్నారు. ఉజ్వల యోజన కింద 10 కోట్ల మంది మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లు అందించారన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు రూ. 2 వేల చొప్పున ఏడాదికి మూడుసార్లు అందిస్తున్నారన్నారు. రైల్వే, రోడ్ మార్గాలు, మురికి కాలువల నిర్మాణంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే పీఎంపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి రెండు నెలలే అయినప్పటికీ కేంద్రం పక్షపాతం చూపుతోందని అనడం రాజకీయ దురుద్దేశం కాదా అని ప్రశ్నించారు. రాహుల్ ప్రధాని అయ్యే అవకాశమే లేదని, దేశ ప్రజలు ఆయనను ఒప్పుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కూలాచారి దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వయం పాలన దినోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సజ్జన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి కింది తరగతులకు విద్యాబోధన చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దామోదర్, సిబ్బంది బన్సీ, పద్మ, జాకీర్, కవిత, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మిషన్ భగీరథ నీరు రెండు, మూడు రోజుల్లోగా రాకపోవడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు కూలీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చాక నీళ్లలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎండల తీవ్రత పెరగడంతో జెట్‌పంపుల్లో నీటిఎద్దడి ఏర్పడుతుందన్నారు. దీంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఏర్పడింది. మండల కేంద్రంలో మంగళవారం జెట్‌పంపు వద్ద ఖాళీ బిందెలతో బారులు తీరారు. అలాగే బురుగుపల్లి, సముందర్ తండా, కాస్లాబాద్ వడ్లం గ్రామల్లో తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఫ్లెక్సీని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



బాన్సువాడ : నస్రుల్లాబాద్ మండలం కంశేట్‌పల్లిలో ఈనెల 26న ఏర్పాటు చేసిన బీజేపీ ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చింపేసారని మంగళవారం బీజేపీ నాయకులు ఎస్సైకి ఫిర్యాదు చేశారు. కంశేట్‌పల్లి గ్రామంలోని ఇబ్రహీం పిండి గిర్ని వద్ద బీజేపీ ఫ్లెక్సీని పెట్టామని, మరుసటి రోజు వచ్చి చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు కావాలని ఫ్లెక్సీని చింపేశారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సున్నం సాయిలు అన్నారు. ఎస్సైకి ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, రాములు, మల్లేశ్, సాయిలు, గోపి, పర్వయ్య తదితరులు ఉన్నారు.

పశువుల కొవ్వుతో కల్తీనూనె



బాన్సువాడ రూరల్: పశువుల కొవ్వు, ఎముకలతో కల్తీ నూనె తయారు చేస్తున్న ఘటన బాన్సువాడలో కలకలం రేపింది. మండల కేంద్రంలోని సంగమేశ్వర కాలనీ రెండో రోడ్డులో ఓ కుటుంబానికి చెందిన వారు ఇంటి దాబాపై పశువుల ఎముకలు, కొవ్వును మరగబెట్టి నూనె తయారు చేస్తుండగా దుర్వాసన రావడంతో స్థానికులు ఆరాతీశారు. పైకి వెళ్లి చూసి కల్తీ నూనె తయారు చేస్తున్నట్లు అనుమానంతో బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించారు. ఇలాంటి కల్తీనూనెలు ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ పాయింట్లలో విక్రయిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడ్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఏసీ దగ్ధం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని సంగీత మొబైల్ షాప్‌లో మంగళవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్ దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగాయని, వెంటనే దుకాణంలో ఉన్న వారు నీటితో మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు.

కేసును 'తుడిచి పెట్టేస్తారా..?'

- ఆర్మూర్ ఘటనపై అనుమానాలెన్నో..
- డీటీని తప్పించేందుకు చక్రం తిప్పుతున్న ఉద్యోగసంఘం నేత
- విచారణ పేరిట కాలయాపన

ట్రాఫిక్ కూడళ్ల వద్ద కారు అద్దాలు తుడుస్తూ డబ్బులు అడుక్కునే వ్యక్తిని కాలితో తన్ని అతడి మృతికి కారణమైన డిప్యూటీ తహసీల్దార్‌ను కేసు నుంచి తప్పించేందుకు ఉద్యోగసంఘం నేత చక్రం తిప్పుతున్నారు. రాజకీయ నాయకుల ద్వారా పోలీసులపై ఒత్తిడి తీసువస్తున్నట్లు సమాచారం. దీంట్లో భాగంగానే కేసును 'తుడిచి పెట్టేందుకు' దారులు వెతుకుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఖలీల్‌వాడి: కారు అద్దం తుడిచి డబ్బులు అడిగిన వ్యక్తిని డిప్యూటీ తహసీల్దార్ ఉద్దేశపూర్వకంగా తనడంతో సదరు వ్యక్తి టిప్పర్ కిందపడి చనిపోయాడు. ఘటన ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో ఈనెల 22వ తేదీన చోటు చేసుకుంది. సామన్యుడిపై ఫిర్యాదు అందిన వెంటనే నిమిషాల్లో స్పందించే పోలీసులు ఆర్మూర్ ఘటనలో విచారణ పేరిట రోజులు గడుపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యులకు ఓ న్యాయం, పేరున్న వ్యక్తులకు మరోన్యాయమా అనే చర్చ సర్వత్రా కొనసాగుతున్నది.

ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో మంజుల శివరాం(32) అనే వ్యక్తి కారు అద్దాలు తడుస్తూ డబ్బులు అడుక్కునేవాడు. ఎప్పటిలాగే 22వ తేదీన సైతం వాహనాల అద్దాలు తుడుస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడికి చేరిన డిప్యూటీ తహసీల్దార్ కారు అద్దాలను సైతం తుడిచి డబ్బుల కోసం కారు ముందుకు వెళ్లాడు. దీంతో సహనం కోల్పోయిన డీటీ కారులోనుంచి కిందికిదిగి శివరాంను తన్నగా అతడు పక్క నుంచి వెళ్తున్న టిప్పర్ వెనుక టైర్ల కిందపడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేశారు.





మృతుడు శివరాం (ఫైల్)

రంగంలోకి ఉద్యోగసంఘం నేత

డిప్యూటీ తహసీల్దార్‌ను కేసు నుంచి తప్పించడానికి ఉద్యోగ సంఘం నేత జోరుగా పైరవీలు చేస్తున్నారనే ఆరోపణలు న్నాయి. ఉద్యోగ సంఘం నేత రంగంలోకి దిగడంతో పోలీసులు సైతం విచారణలో డిప్యూటీ తహసీల్దార్‌ను అదే రోజు విచారించి వదిలేసినట్లు తెలిసింది. ఉద్యోగ సంఘ నేత జోక్యం కారణంగానే పోలీసులు విచారణ పేరిట కాలపయాన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

సోషల్ మీడియాలో సీసీ ఫుటేజీ వైరల్

శివారంను డీటీ తన్నడం, అతడు టిప్పర్ కిందపడి మృతి చెందిన ఘటనకు సంబంధించి సీసీ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సీసీ ఫుటేజీ స్పష్టంగా ఉన్నప్పటికీ పోలీసులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేసుల దర్యాప్తులో సీసీ ఫుటేజీని కీలకంగా భావించే పోలీసులు.. ఈ కేసులో మాత్రం అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. శివరాం మృతికి డీటీ కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆర్మూర్‌పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేయగా, నిందితులకు శిక్షపడేలా చూస్తామని ఎస్‌హెచ్‌వో రవికుమార్ వారికి హామీ ఇచ్చారు.

విచారణ చేస్తున్నాం

ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద జరిగిన ఘటనలో డిప్యూటీ తహసీల్దార్‌పై విచారణ చేస్తున్నాం. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నాం. విచారణలో తేలిన అంశాల ఆధారంగా నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– రవికుమార్, ఎస్‌హెచ్‌వో, ఆర్మూర్

దర్జీల బతుకుల్లో కనిపించని దర్జా



ఈ చిత్రంలో కనిపిస్తున్న దర్జీ గడ్కోల్ గ్రామానికి చెందిన గట్ల స్వామి. ఇప్పటికీ దర్జీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాడు. గత యాభై ఏళ్లుగా దర్జీ వృత్తిలోనే కొనసాగుతున్నాడు. చేతి నిండా పని లేకపోవడంతో వడ్లు ఆరబెట్టుకోవడానికి వినియోగించే తాటిపత్రులు కుడుతూ జీవనం నెట్టుకొస్తున్నాడు.

- 'రెడీమేడ్' కారణంగా పని కరువు
- కనుమరుగవుతున్న టైలర్‌షాపులు
- నేడు టైలర్స్ డే

సిరికొండ: దర్జీల బతుకుల్లో దర్జా కరువైంది. ఒకప్పుడు ఓ వెలుగువెలిగిన టైలర్ వృత్తి.. రెడీమేడ్ దుస్తుల రాకతో క్రమేణా మసకబారుతున్నది. శుభకార్యాలు ఉన్నాయంటే నాటి రోజుల్లో వారం, పది రోజుల ముందు దుస్తులు కుట్టించుకోవాలనుకునే వారు. దసరా, దీపావళి, రంజాన్, క్రిస్మస్ పండగ ఏదైనా దర్జీలకు చేతినిండా పని ఉండేది. దర్జీలను పల్లెల్లో గౌరవంగా చూడడంతోపాటు వారికి రైతులు తాము సాగు చేసిన పంట దిగుబడులను ప్రేమతో అందించేవారు. ఇదంతా గతం.. రెడీమేడ్ వ్యవస్థ రావడంతో వారి బతుకు ముందుకుసాగడం లేదు. తగినంత పని దొరకక, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కోవాల్సిన దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మరికొందరు గత్యంతరం లేని పరిస్థితుల్లో పని దొరికినా, దొరక్కపోయినా ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు.

కనిపించని దుకాణాలు

రెడీమేడ్ దుస్తులు తక్కువ ధరలో లభిస్తుండటంతో దర్జీలు చాలా మంది తమ వృత్తిని వదులుకుంటున్నారు. గతంలో ప్రతి గ్రామంలో కనిపించిన టైలర్ షాపు ఇప్పుడు కనిపించకుండాపోతున్నాయి. ప్రభుత్వం నుంచి ఒక్క రేషన్ కార్డు తప్ప ఎలాంటి సహాయం లేని చేతి వృత్తుల కులం మేరకులం ఒకటేనని దర్జీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



దర్జీలను ఆదుకోవడానికి ప్రభుత్వం శ్రద్ధ వహించాలి. 50 ఏళ్లు నిండిన దర్జీలకు పింఛన్లు ఇవ్వాలి. అధునాతన కుట్టుమిషన్లను ఉచితంగా అందజేయాలి. బీసీ–డీలో ఉన్న మమ్ముల్ని బీసీ–ఏలోకి మార్చాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరఫరా చేస్తున్న యూనిఫామ్‌లను స్థానికంగా గ్రామాల్లోనే దర్జీల చేత కుట్టిస్తే ఉపాధి దొరుకుతుంది.

– కొక్కు ప్రసాద్, మేరు సంఘం మండలాధ్యక్షుడు

ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత



సౌత్‌క్యాంపస్‌లో క్విజ్‌పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసిన ఎన్‌వైకే ప్రతినిధి

- జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్

భిక్కనూరు : ఎయిడ్స్ నివారణను ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలని జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ అన్నారు. మంగళవారం తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్, అంటువ్యాధుల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో ఈ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని నివారణే మార్గమన్నారు. విద్యార్థులు ఈ వ్యాధిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఐవీ నియంత్రణ జిల్లా అధికారి చల్ల సుధాకర్‌గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వం ఈ తరహా వ్యాధుల నివారణకు ఎన్నో చర్యలను చేపట్టిందన్నారు. ఎయిడ్స్ నివారణపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇలాంటి వ్యాధుల నిర్మూలనలో యువత పాత్ర కీలకమైందని ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అంజయ్యతో పాటు ప్రొఫెసర్లు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బాన్సువాడలో కార్మిక శాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం బాన్సువాడలో కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ సతీష్‌రెడ్డికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ లేబర్ కార్డులు ఉన్నవారికి ఆర్థిక ప్రయోజనాల కోసం ఏఐటీయూసీ పోరాడుతోందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికులు జమ చేసుకున్న డబ్బులు వెల్ఫేర్ బోర్డు నుంచి ఇతర శాఖలకు మళ్లించారని, దీంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్మికుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని డెలివరీకి ఇస్తున్న రూ.30 వేల నుంచి రూ. 50 వేలకు పెంచాలని, పెళ్లికి ఇస్తున్న రూ. 30 వేల నుంచి రూ. లక్షకు పెంచాలని సూచించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో స్టీరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. లేబర్ కార్డుకు ఉన్న 60ఏళ్ల పరిమితిని ఎత్తివేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మికులు సురేశ్, రాములు, లక్ష్మణ్, సాయిలు, గంగామణి తదితరులున్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : బగలాముఖి అమ్మవారి క్యాలెండర్లను నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మంగళవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే సూర్యనారాయణ ఎల్లారెడ్డి బగలాముఖి పీఠానికి సంబంధించిన క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జ్యోతిష్య పండితులు క్రాంతిపటేల్, బీసీ సంఘం నాయకులు రేవంతప్ప, సతీష్ తదితరులున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

- రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

నిజామాబాద్‌అర్బన్: ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. చరిత్రను వక్రీకరిస్తూ కేవలం మనువాద సంస్కృతిని పెంపొందించే దిశగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తున్నాయన్నారు. ప్రజలు కలిసికట్టుగా ఉండి ఈ మనువాద విష సంస్కృతిని పారదోలాలన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతుల మీద జరిగిన దాడులను ఖండించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆయా అంశాలపై దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలు, ముఖ్యమైన విద్యా కేంద్రాలలో ముఖాముఖి చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీలో మార్చి 12న విద్యార్థులతో ముఖాముఖి చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫోరం కన్వీనర్ వినాయక్‌రెడ్డి, జాగో తెలంగాణ కోర్ కమిటీ మెంబర్ ప్రొఫెసర్ పద్మజ, స్టేట్ కమిటీ మెంబర్ నిర్మల, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేటలో బోనాల ఊరేగింపు



దోమకొండ : మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. బుధవారం తిరుగుబోనాలు, అమ్మవారి ఆలయం వద్ద చక్కెర తీర్థం నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్తగారి శిరీష్‌గౌడ్, ప్రతినిధులు పోషగౌడ్, స్వామిగౌడ్, మోహన్‌గౌడ్, శ్రావణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ వధువుకు పుస్తెమట్టెల వితరణ



కామారెడ్డి టౌన్ : దోమకొండ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల మాధవి వివాహానికి కావాల్సిన పుస్తె, మట్టెలను పట్టణానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ పాక జ్ఞానేశ్వరి మంగళవారం వితరణ చేశారు. వధువు తల్లిదండ్రులను కోల్పోవడం, నిరుపేద కుటుంబం కావడంతో తమ వంతుగా సాయం చేసినట్లు కౌన్సిలర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు రవిప్రసాద్ తదితరులున్నారు.

విద్యార్థులకు మెగా సైన్స్ దినోత్సవం

బాన్సువాడ : లయన్స్ క్లబ్ ఆఫ్ బాన్సువాడ ఆధ్వర్యంలో మంగళవారం లయన్స్ భవనంలో విద్యార్థులకు మెగా సైన్స్ దినోత్సవం నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. సైన్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు అంజిరెడ్డి, ప్రతినిధులు రమణ, అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు సంగమేశ్వర్, గొల్ల శంకర్ తదితరులన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

క్రైం కార్నర్

గుర్తు తెలియని యాచకుడి మృతి



ఆస్పత్రిలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో గుర్తు తెలియని యాచకుడు మంగళవారం మృతి చెందాడు. పట్టణంలోని రాజా ఆయిల్ మిల్ ప్రాంతంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉన్నాడని సమాచారం అందడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని అతడిని ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడి వయస్సు 28 నుంచి 30 ఏళ్లు ఉంటుందని, అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పట్టణ పోలీసులను సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు.

జానకంపేట్ శివారులో వృద్ధుడి మృతదేహం..

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట శివారులో గుర్తు తెలియని 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని బోధన్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలుసుకొనేందుకు విచారణ చేపడుతున్నారు.

ఉరేసుకొని ఫార్మసిస్ట్ ఆత్మహత్య



హరిప్రసాద్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం చెందిన ఓ ఫార్మసిస్ట్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... అల్వాల హరిప్రసాద్ కావేరీ హోటల్ వెనుక ప్రాంతంలో నివాసముంటూ ప్రైవేట్‌కంపెనీలో ఫార్మాసిస్ట్‌గా పని చేస్తున్నాడు. అతేడికి 2013 లో దివ్యభారతితో పెళ్లికాగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, గొడవల కారణంగా దివ్యభారతి కొద్ది రోజులుగా పిల్లలతో కలిసి తల్లిగారింటి వద్ద ఉంటోంది. భార్యాపిల్లలు వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన హరిప్రసాద్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి దత్తాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

మాగిలో అగ్నిప్రమాదం



దగ్ధమైన వంట సామగ్రి

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో నివాసపు రేకుల షెడ్డుతోపాటు గడ్డివాము దగ్ధమయ్యాయి. పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజం సాయిలుకు చెందిన గడ్డివాముకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోగా, గడ్డివాముతోపాటు పక్కనే ఉన్న మామిళ్ల రామవ్వకు చెందిన నివాసపు రేకుల షెడ్డులోని సామగ్రి కాలిబూడిదయ్యాయి. రామవ్వకు రూ.1.10లక్షలు, సాయిలుకు రూ.40వేల ఆస్తినష్టం జరిగింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజయ్య పంచానామా చేశారు. బాధిత కుటుంబాలను మాజీ సర్పంచ్ కమ్మరికత్త అజయ్య పరామర్శించారు.

లోలంలో రెండు గుడిసెలు..



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గుడిసెలు

ఇందల్వాయి: మండలంలోని లోలంలో మంగళవారం వేకువజామున జరిగిన అగ్ని ప్రమాదంలో సున్నం సత్తెమ్మ, సున్నం భూమయ్యకు చెందిన రెండు నివాసపు గుడిసెలు దగ్ధమైనట్లు తహసీల్దార్ వెంకట్‌రావు తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి గ్యాస్ సిలిండర్ పేలడంతో పక్కనే ఉన్న కందాల ప్రశాంత్ అనే వ్యక్తి ఇల్లు సైతం పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. బాధితులు సత్తెమ్మ, భూమయ్య వేరే గ్రామానికి వెళ్లారని, వారింట్లో కొద్ది రోజుల క్రితమే వివాహం జరిగిందన్నారు. రూ.లక్ష నగదుతోపా టు, ఫర్నిచర్, ఇతర విలువైన వస్తువులు కాలిపోయాయని తెలిపారు. సుమారు రూ.6లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు, రెవెన్యూ అధికారులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు

డిచ్‌పల్లి: ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కే మల్లేశ్, ఎస్సై మహేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గొల్లపల్లికి చెందిన హరీశ్ గ్రామానికి చెందిన యువతిని కొన్ని సంవత్సరాలుగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలుచెప్పి నమ్మించి మోసగించాడని పేర్కొన్నారు. తనను పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి తేవడంతో హరీశ్ తప్పించుకు తిరుగుతూ మరో యువతిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధంకావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన కాకి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కాకి రాకేశ్, బాబుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రమేశ్‌బాబు మంగళవారం తెలిపారు. ప్రశాంత్‌కు రాకేశ్‌తో కల్లు దుకాణంలో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. దీన్నిదృష్టిలో పెట్టుకుని అన్నదమ్ముళ్లు రాకేశ్, బాబు కలిసి ప్రశాంత్ ఇంటికి వెళ్లి కర్రలతో దాడికి పాల్పడ్డారు. దాడిలో ప్రశాంత్ తల్లి ముత్యమ్మకు గాయాలు కాగా, ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో చైన్‌స్నాచింగ్

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని తిరుమల కాలనీలో సోమవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. పట్టణంలోని తిరుమల కాలనీలో భూసం రాజన్న అనే వ్యక్తి సోమవారం రాత్రి దుకాణం మూసివేసి ద్విచక్ర వాహనంపై భార్యతో కలిసి వెళ్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఒంటరిగా ఉంటున్న మహిళ హత్య



బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని బండారెంజల్ గ్రామానికి చెందిన గంట బాలవ్వ(50)హత్యకు గురైనట్లు సీఐ జగడం నరేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో బాలవ్వ ఒంటరిగా ఉంటోంది. ఆమె ఇంట్లో నుంచి దుర్వాసన వస్తోందని చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించగా, బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు బాలవ్వ తలపైకొట్టి ఆమెను హత్య చేసినట్లు గుర్తించారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె కూతురు శ్రీకాంతకు సమాచారం అందించారు. గ్రామానికి చెందిన బోడ సాయిలుపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి కూతురు శ్రీకాంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

భిక్కనూరు: మద్యం సేవించి మండలంలో జాతీయ రహదారిపై వాహనం నడుపుతున్న ఒకరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. దోమకొండ మండలం ఫరీద్‌పేటకు చెందిన ఓ వ్యక్తి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడన్నారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అతడికి రెండు రోజుల జైలు శిక్షతోపాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్‌ఎస్ నగర్ పీఎస్ పరిధిలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడగా, రెండో తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్రతాప్ అతడికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.200 జరిమాన విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని ఎస్సై సూచించారు.

తాళాలు వేసిన ఇళ్లలో చోరీకి యత్నం

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండల కేంద్రంలో చిల్లర దొంగలు హల్‌చల్ చేశారు. సోమవారం రాత్రి గ్రామంలోని పలు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. ఇళ్లలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు బీరువాల్లో డబ్బులతోపాటు విలువైన వస్తువులు లభించకపోవడంతో సామన్లను చిందరవందర చేసి వెళ్లిపోయారు. గ్రామస్తుల సమాచారం మేరకు బోధన్ రూరల్ పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డి : మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన రాజన్నగారి సుధాకర్ మొబైల్ ఫోన్ పోగొట్టుకోవడంతో బాధితుడికి మంగళవారం అందించినట్లు ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు.